అన్ని వర్గాలకు సమన్యాయం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబర్ 11: ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ఇండ్లకు ప్రభుత్వం తరుపున బుధవారం నష్ట పరిహారం అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇండ్లు కూలిపోయిన 5 మంది బాధితులకు ఒక్కొక్కరికీ రూ.3200 చొప్పున చెక్కులను అందజేశారు. అనంతరం సురసముద్రం చెరువును పరిశీలించారు. వినాయక నిమజ్జనం సజావుగా శాంతియుతంగా నిర్వహించాలని, నిమజ్జన సందర్భంలో ఎక్కడ కూడా ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు వహించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం మేడిగడ్డ సమీపంలోని కత్వవాగును పరిశీలించారు. వాగు ప్రవాహంతో ప్రయాణ సౌకర్యం స్థంభించడం వలన తాత్కాలిక మరమత్తులు చేపట్టి రాక పోకలు కల్పించాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. తదనంతరం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో భక్త మార్కండేయ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లలిత, ఎంపీడీవో కుసుమ మాధురి, మున్సిపల్ కమిషనర్ వసంత, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు నర్సింహ, జగన్, మానయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తొద్దు

బొబ్బిలి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 11: గణేశ్ నిమజ్జనానికి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని బొబ్బిలి చెరువును బుధవారం ఏసీపీ రంగస్వామి, సీఐ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, మాజీ చైర్మన్ విశ్వం, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులకు సకల సదుపాయాలను కల్పించాలన్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు భక్తులకు అందుబాటులో ఉండాలన్నారు. అదే విధంగా ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా చెరువు వద్ద భద్రత చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సర్వర్‌పాషా, శ్రీనివాస్, నాయకులు చెన్నయ్య, బాబర్‌ఖాన్, ప్రకాశ్, బస్వం, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజు, విజయ్‌కుమార్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అలీఖాన్, ఖదీర్, అశోక్ పాల్గొన్నారు.

బొబ్బిలిచెరువు వద్ద ఏర్పాట్ల గురించి అధికారులు, పోలీస్‌లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

బొబ్బిలిచెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్

భక్తులు జాగ్రత్తలను పాటించాలి

మున్సిపాలిటీలోని బొబ్బిలి, పెరుమాళ్ల చెరువు వద్ద నిమజ్జనానికి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలోని బొబ్బిలిచెరువు వద్ద ఏర్పాట్లను బుధవారం మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్ బచ్చలి నర్సింహ, నాయకులు నర్సింహ, శేఖర్, శ్రీశైలం, రవి, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువుల వద్ద క్రేన్లను, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. భక్తులు తగిన జాగ్రత్తలను పాటిస్తూ చెరువుల వద్ద ఉన్న అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలతో ఆధ్యాత్మిక శోభ

షాద్‌నగర్‌టౌన్ : గణేశ్ ఉత్సవాలతో షాద్‌నగర్ మున్సిపాలిటీలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 22వ వార్డులో వార్డు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, నాయకులు రవియాదవ్, రఘునాథ్‌యాదవ్, యూత్ సభ్యులతో కలిసి బుధవారం పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు, యూత్ సభ్యులు జంగరాజు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి

కడ్తాల్, సెప్టెంబర్ 11: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గడ్డమీది తండా పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన, పోషకాల వారోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా తల్లులు, గర్భిణులు, బాలింతలకు ఆమె పలు సూచనలు చేశారు. చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. బాలింతలు, చిన్నారులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కళావతి, గీత తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నందిగామ, సెప్టెంబర్11: నందిగామ మండలంలోని అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణానికి ప్రముఖ వ్యాపారవేత్త నీలం విజయ్‌కుమార్ రూ.2.51లక్షలు విరాళాన్ని బుధవారం శ్రీగిరిషన్ నాయర్ గురుస్వామి, దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దేవాలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. ఆయన వెంట దేవాలయ కమిటీ సభ్యులు బాల్‌రెడ్డి, లక్ష్మయ్యయాదవ్, సుదర్శన్‌గౌడ్, హరిజీవన్, తుమ్మల నర్సింహులు, కృష్ణయాదవ్, శ్రీకాంత్‌గౌడ్, శేఖర్‌గౌడ్, జంగయ్య, కృష్ణగౌడ్, నిరంజన్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 11 : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు భరోసానిస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం ప్రజాభవన్‌లో నియోజకవర్గంలోని యాచారం మండలం కొత్తపల్లి, మంతన్‌గౌరెల్లి, మేడిపల్లి, ధర్మన్నగూడ గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన రూ.2.50లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. వారి వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఉన్నారు.

డీజేలు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు

మొయినాబాద్, సెప్టెంబర్11: గణేశ్ నిమజ్జనాలకు ఎవరైనా డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న డీజే ఆపరేటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిచి వారితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ నిమజ్జనాల ర్యాలీలకు డీజేలు అనుమతి లేదని తెలిపారు. ఎవరైనా డీజేలు ఏర్పాటు చేస్తే ఆపరేటర్లపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ఎదుట డీజే ఆపరేటర్లను బైండోవర్ చేశారు.

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలి

సరూర్‌నగర్ సర్కిల్ ఎస్ఈ మాధవరెడ్డి

సెక్షన్ అధికారులతో సమావేశమైన ఎస్ఈ మాధవరెడ్డి

తుర్కయాంజాల్, సెప్టెంబర్ 11 : వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని సరూర్‌నగర్ సర్కిల్ ఎస్ఈ సి.మాధవరెడ్డి అన్నారు. బుధవారం తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపట్నం డివిజన్ ఆఫీస్‌ను సందర్శించి ఈఆర్‌వోను తనిఖీ చేశారు. అనంతరం ఆయన నాలుగు సెక్షన్ల ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఇబ్రహీంపట్నం డీఈ యాదగిరి, ఎస్ఏవో రమణారెడ్డి, ఏవో శేఖర్‌రెడ్డి, ఏడీఈ వినోద్‌రెడ్డి, ఏఈ రాములు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

చెక్కును అందజేస్తున్న మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి

మంచాల, సెప్టెంబర్ 11: మండల పరిధిలోని చీదేడు గ్రామానికి చెందిన తోడె ప్రభాకర్ అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందగా, వైద్య ఖర్చుల నిమిత్తం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి నుంచి రూ.33వేలు మంజూరు అయ్యాయి. ఆ చెక్కును బాధితుడి తల్లికి బుధవారం గ్రామ మాజీ సర్పంచ్ బైరిక రమాకాంత్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ తిరుమలేశ్, కాంగ్రెస్ నాయకులు శేఖర్‌రెడ్డి, మహేందర్, అనిల్, యాదయ్య, కృష్ణ పాల్గొన్నారు.

చేవెళ్ల ప్రభుత్వ దవాఖానలో

దొంగ హల్‌చల్

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 11: చేవెళ్ల ప్రభుత్వ దవాఖానలో మంగళవారం అర్ధరాత్రి ఓ దొంగ హల్‌చల్ చేశాడు. మద్యం తాగి వచ్చి బ్లేడ్‌తో గొంతు కోసుకోవడమే కాకుండా అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడికి యత్నించాడు. దవాఖానలోని వస్తువులను చిందరవందరగా పడేశాడు. చేవెళ్ల గ్రామానికి కె.కృష్ణ గతంలో దొంగతనాలకు పాల్పడిజైలుకు వెళ్లి వచ్చాడు. మద్యానికి అలవాటుపడి జులాయిగా తిరుగుతున్నాడు. మంగళవారం రాత్రి మద్యం తాగి వచ్చి కోర్టు ఆవరణలోకి వెళ్లాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికివెళ్లి బయటకు పంపించేశారు. అక్కడి నుంచి ఓ టీస్టాల్ వద్దకు వచ్చి అక్కడి వారితో గొడవపడ్డాడు. అంతటితో ఆగకుండా ప్రభుత్వ దవాఖానకు వెళ్లి సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తూ తన వెంట తెచ్చుకున్న బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. అక్కడ గదిలో ఉన్న వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడేయడంతో సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకుని అక్కడికి వచ్చిన పోలీసు సిబ్బంది అతడిని బయటకు తీసుకెళ్లారు.



దవాఖానలో హల్‌చల్ చేస్తున్న దొంగ

మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం

ఇబ్రహీంపట్నంరూరల్, సెప్టెంబర్ 11 : డ్రగ్, గంజాయి, మాదక ద్రవ్యాలతో విద్యార్థుల జీవితాలు ఛిద్రమవుతున్నాయని, వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇబ్రహీంపట్నం ఎస్సై నాగరాజు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి భాస్కర్ అన్నారు. బుధవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని గురుకుల పాఠశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ నేటి విద్యార్థి, యువతపై ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు వ్యసనాలకు పాల్పడకుండా భవిష్యత్‌పై దృష్టి సారించి బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రణయ్, శంకర్, జంగయ్య, శ్రీకాంత్, వంశీ, తరంగ్, వేణు, వినయ్, మహేశ్ తదితరులున్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు

తలకొండపల్లిలో దొంగల బీభత్సం

నాలుగు ఇండ్లలో చోరీ

-రూ.6 లక్షల నగదు, బంగారం అపహరణ

కడ్తాల్, సెప్టెంబర్ 11: తలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడ్డారు. నాలుగు ఇండ్లలో చొరబడిన దొంగలు నగదు, బంగారాన్ని అపహరించారు. మండల కేంద్రానికి చెందిన ఆవంచ చెన్నకేశవరెడ్డి ఇంట్లో రూ.6 లక్షల నగదు, దోమ సురేశ్‌రెడ్డి ఇంట్లో మూడు తులాల బంగారం, దోమ రాంరెడ్డి ఇంట్లో మూడున్నర తులాల బంగారం తీసుకెళ్లినట్లు ఎస్ఐ శ్రీకాంత్ పేర్కొన్నారు. దొంగతనం జరిగిన ఇళ్లను ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ స్థానిక పోలీసులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఇంటి యాజమానులతో మాట్లాడి వివరాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీకి గురైన ఇంటి యాజమానితో మాట్లాడుతున్న సీఐ ప్రమోద్‌కుమార్

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఆమనగల్లు, సెప్టెంబర్ 11: ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లో అక్రమంగా ఇసుక మట్టి తరలిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. తలకొండపల్లి మండలం తుమ్మలకుంట తండా వద్ద పెద్దూర్ తండాకు చెందిన కేతావత్ రెడ్యా, అక్రమంగా తన ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది ట్రాక్టర్ డ్రైవర్ ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన నేనావత్ దేవేందర్ తన టిప్పర్‌లో కల్వకుర్తి వైపు నుంచి తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వినాయక లడ్డూ వేలం

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 11: చేవెళ్ల మండల కేంద్రంలోని పలు కాలనీల్లో వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో వినాయక మండపాల వద్ద పూజలు చేసి లడ్డూల వేలం నిర్వహించారు.

చేవెళ్ల మండల కేంద్రంలో

చేవెళ్ల మండల కేంద్రంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక లడ్డూ వేలం పాట వేయగా, రూ.లక్ష 8వేలకు బి.యాదిరెడ్డి దక్కించుకున్నారు. అదే విధంగా గుండాల గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక లడ్డు వేలంలో రూ.35000కు శ్రీశైలం దక్కించుకోగా, చిన్న లడ్డు 30వేలకు ముదిరాజ్ యువజన సంఘం దక్కించుకుంది.

వైద్య శిబిరానికి విశేష స్పందన

శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, పాల్గొన్న నాయకులు

కడ్తాల్ (తలకొండపల్లి), సెప్టెంబర్ 11: తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్-లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, కామినేని దవాఖాన సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 252 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యులు అఖిల్, అనిల్ తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత వెంకటేశ్, మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ సునీతసుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు నిరంజన్, ఆలయ చైర్మన్ అంజిరెడ్డి, నాయకులు ఆశన్న, లక్ష్మీనారాయణగౌడ్, శ్రీను, శంకరయ్యగౌడ్, వెంకటయ్య, ఆంజనేయులు, మల్లేశ్, బాలస్వామి ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

కడ్తాల్, సెప్టెంబర్ 11 : సమాజంలో ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కడ్తాల్‌లోని శివాజీనగర్‌లో భవాని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొంటుందని తెలిపారు. అనంతరం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ శివప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

దుండగుల రిమాండ్

కొత్తూరు, సెప్టెంబర్ 11: ట్రక్కు డ్రైవర్‌ను బెదిరించి ట్రక్కుతో పరారైన ముగ్గురు యువకులకు రిమాండ్ విధించిన ఘటన కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కొత్తూరు సీఐ నరసింహారావు వివరాల ప్రకారం.. షాద్‌నగర్ వైపు వెళ్తున్న ట్రక్కు డ్రైవర్‌ను ముగ్గురు యువకులు బెదిరించి రూ. 300, సెల్‌ఫోన్ తీసుకొని ట్రక్కుతో పరారయ్యారు. వివరాల్లోకి వెళితే తొండుపల్లికి చెందిన యమ్మ శ్రీకాంత్, అత్తాపూర్‌కు చెందిన బినవోని మురళి, తోనె లోకేశ్ బైకులపై వచ్చి షాద్‌నగర్ వైపు వస్తున్న ట్రక్కును చేగూర్ రోడ్డు వద్ద అడ్డగించారు. డ్రైవర్ సర్జీత్ సింగ్ వద్ద ఉన్న రూ. 300, ఓ సెల్‌ఫోన్, లాక్కున్నారు. కేసు నమోదు చేసిన కొత్తూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 10న తిమ్మాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద దుండగులు అనుమానాస్పదంగా కన్పించడంతో వారిని విచారించగా, ట్రక్కును ఎత్తికెళ్లిపోయిన తొండుపల్లికి చెందిన యమ్మ శ్రీకాంత్, అత్తాపూర్‌కు చెందిన బినవోని మురళి, తోనె లోకేశ్‌గా గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించామని సీఐ నరసింహారావు తెలిపారు.

పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ తట్టిఅన్నారం వైఎస్సార్ కాలనీలో శివలింగం ఆకారంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం

- పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 11

భగవద్గీతతో జ్ఞానం పెంపొందుతుంది

ఆమనగల్లు, సెప్టెంబర్ 11: భగవద్గీత పారాయణంతో జ్ఞానం లభిస్తుందని డాక్టర్ కసిరెడ్డి స్నేహలతరెడ్డి, కసిరెడ్డి సింధులతారెడ్డి పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని జగదాంబ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో చిన్నారులకు ఒక సంవత్సరం పాటు భగవద్గీత జ్ఞానాన్ని ప్రత్యక్షంగా ఆన్‌లైన్‌లో బోధించారు. ఈ సందర్భంగా ఆమనగల్లులోని జగదాంబ ధ్యాన పిరమిడ్ కేంద్రంలో బుధవారం భగవద్గీత జ్ఞాన సంబురాలను నిర్వహించారు. చిన్నారులతో భగవద్గీతను చదివించి సారాంశాన్ని వినిపించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ధ్యానగురువు కసిరెడ్డి జ్యోతి, సాయిబాబా, దేవేందర్‌శెట్టి, శాంతమ్మ, ప్రమీలమ్మ, చిన్నారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మండల కేంద్రానికి చెందిన రాజయ్య అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ బుధవారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ట్రస్టు తరపున రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

- కడ్తాల్, సెప్టెంబర్ 11

గంగమ్మ ఒడికి గణనాథుడు

మొయినాబాద్, సెప్టెంబర్ 11 : ఐదు రోజుల పాటు భక్తులను నుంచి విశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేశాడు. మండల పరిషత్ కార్యాలయ దుకాణాల సమూదాయాల వద్ద ప్రతిష్ఠించిన గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమానికి మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి విచ్చే పూజలు చేశారు. అనంతరం రాజేంద్రనగర్ సమీపంలోని కుంటలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జయవంత్, రాజు, యాదగిరిచారి, వంశిరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

నోసల్(ఫైల్)

మొయినాబాద్, సెప్టెంబర్11: మదర్సాలో చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రంలోని భరత్‌పూర్ జిల్లాకు చెందిన ఆసీన్ కుమారుడు నోసల్ (11) మొయినాబాద్‌లోని ముస్తాఫా హిల్స్‌లోని మదర్సా మహ్మదీయ స్కూల్‌లో చదువుతున్నాడు. అయితే మంగళవారం ఉదయం మదర్సాలో ప్రార్థనలు జరుగుతుండగా స్కూల్ వెనక భాగం నుంచి పారిపోయాడు. స్కూల్‌లో నోసల్ కనిపించకపోవడంతో అందులో ఉండే వారు చుట్టు పక్కలా వెతికారు. విద్యార్థి ఆచూకి కనిపించకపోవడంతో మొయినాబాద్ గ్రామానికి చెందిన ఏడీ ఇర్ఫాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పశు వైద్యకేంద్రానికి కుర్చీలు బహూకరణ

కొత్తూరు, జూన్ 26: మండల వైద్యకేంద్రానికి కౌన్సిలర్ మాదారం నర్సింహాగౌడ్ బుధవారం కుర్చీలు బహూకరించారు. ఈ సందర్భంగా నర్సింహాగౌడ్ మట్లాడుతూ మండల వైద్యాధికారి డా. స్ఫూర్తి పశువైద్య కేంద్రానికి కుర్చీల అవసరం ఉందని చెప్పిందన్నారు. దీంతో కుర్చీలు కొని బహూకరించానని వివరించారు. పశు వైద్యశాలకు మున్సిపాలిటీ, మండలం నుంచి ఎంతో మంది రైతులు పశువులను తీసుకొని వస్తుంటారని అన్నారు. వారు కూర్చోవడానికి కుర్చీల కొరత ఉందని చెప్పారని అన్నారు. దీంతో కుర్చీలు బహూకరించానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మదారం కృష్ణగౌడ్, వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకుడు మోర జనార్దనరెడ్డి, వీరమోని శ్రీను పాల్గొన్నారు.